www.samasamajam.in

తెలంగాణ,
ఆంధ్రప్రదేశ్
శుక్ర వారం
06 జనవరి, 2023
సంపుటి - 07,
సంచిక-228
పేజీలు - 4
వెల రూ. 5/-

సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: గోసుకొండ పృథ్వీరాజు ❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Vishakapatnam, Vijayawada, Ongole

కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై మంటలు

కలెక్టరేట్ ముట్టడికి రైతుల యత్నం

రైతు రాములు ఆత్మహత్యపై భగ్గుమన్న కామారెడ్డి

మాస్టర్‌ప్లాన్‌కు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన

కలెక్టరేట్‌కు ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

పోలీసులతో తోపులాటతో ఉద్రిక్తత

ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాలన్న బిజెపి

కామారెడ్డి, జనవరి 5 (సమ సమాజం): కామారెడ్డి మాస్టర్ ప్లాన్ వివాదం తీవ్రరూపం దాలుస్తోంది. కామారెడ్డి మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలంటూ భూములు కోల్పోతున్న రైతులు కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరారు. రైతు ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు ర్యాలీగా తరలివెళ్లారు. కామారెడ్డి కొత్త బస్టాండ్ చర్చి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగుతోంది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాస్టర్ ప్లాన్ నిర్ణయంతో రాములు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాములు ఆత్మహత్యతో అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు రాజీనామా చేశారు. ఉపసర్పంచ్ సహా ఆరుగురు వార్డు మెంబర్లు, పిఏసీఎస్ డైరెక్టర్, ఆరుగురు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు రాజీనామా చేశారు. రైతుల భూములను లాక్కునే మాస్టర్ ఎ÷-లాన్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఈ మురికి కాలువకు మోక్షమెప్పుడు?

కెటిఆర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలతో నిరసన

హామీ

సిరిసిల్ల, జనవరి 5 (సమ సమాజం): మంత్రి కేటీఆర్ కు సొంత ఇలాకా సిరిసిల్లలో నిరసన సెగ ఎదురయ్యింది. ఐదేళ్లయినా ఇచ్చిన నెరవేర్చలేదంటూ ప్రజలు నిరసనకు దిగారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ 3వ

ఎమ్మెల్యేల ఎరకేసు

హైకోర్టు తీర్పు కాపీని అందుకున్న సిబిఐ

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): ఎమ్మెల్యేలకు ఎర కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైకోర్టు ఆర్డర్ కాపీ సీబీఐ చేతికి అందింది. దీంతో సీబీఐ ఏక్షణమైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చు. సింగిల్ బెంచ్ ఆర్డర్ కాఫీనీ సీబీఐ న్యాయ నిపుణులు పరిశీలిస్తున్నారు. ఏ సెక్షన్స్ 3వ

కాంగ్రెస్‌తో బిఆర్ఎస్ పొత్తు ఉండదు

ఒంటరిగానే పోటీ చేస్తాం: శ్రీనివాస గౌడ్

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): కాంగ్రెస్ పార్టీతో బీఆర్ఎస్ పొత్తు ప్రసక్తే లేదని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. 2023లో అతిపెద్ద జోక్ ఇదేనని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటిరిగానే పోటీ చేస్తుందని వెల్లడించారు. తమకు ఎవరితో పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పోలవరం విషయంలో సీఎం కేసీఆర్ విశాల దృక్పథంతో పనిచేస్తారని తెలిపారు. జాతీయపార్టీగా అన్ని రాష్ట్రాల్లో సమస్యలను అధ్యయనం చేసి ముందుకు 3వ

దర్యాప్తుకు వెళ్లిన కానిస్టేబుల్ పై దాడి

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఓ కానిస్టేబుల్ పై గుర్తు తెలియని వ్యక్తి తల్వార్‌తో దాడి చేశాడు. తీవ్రగాయలైన ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించారు. కానిస్టేబుల్ రాజు ఓ కేసు దర్యాప్తు కోసం బస్తీకి వెళ్లాడు. అక్కడ ఏమైందో ఏమో కానీ గుర్తు తెలియని ఓ వ్యక్తి తల్వార్‌తో రాజుపై దాడికి దిగాడు. తీవ్రగాయాల పాలైన రాజును వెంటనే స్థానికంగా ఓ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీలో డ్రైనేజీ సమస్యపై నిరసన

భిక్షాటన చేపట్టిన కాలనీ వాసులు

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): హైదరాబాద్ బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడ న్యూ మధురానగర్ కాలనీవాసులు బిక్షాటన చేపట్టారు. కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశారు. గత 10 సంవత్సరాల క్రితమే న్యూ మధురానగర్ కాలనీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించామని.. ఇప్పుడు ఇంద్రహిల్స్ పేరు పెడితేనే డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని స్థానిక కార్పొరేటర్ దీపికా శేఖర్ రెడ్డి చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదని.. కంపు కొడుతోందని కాలనీవాసులు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయించాలన్న ఆలోచన కూడా స్థానిక కార్పొరేటర్?కు లేదని మండిపడుతున్నారు. అంతకుముందు రిజిస్టర్ 3వ

ఉద్యమకారులకు సముచిత గౌరవం

ఆంజనేయులు గౌడ్ ను అభినందించిన కవిత

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్‌తో నడిచిన ఉద్యమకారులకు సముచిత గౌరవం దక్కుతోందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. తెలంగాణ ప్రజలకు సేవ చేసే అవకాశం సీఎం కేసీఆర్ కల్పించారని చెప్పారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చుకొని అభివృద్ధి వైపు వెళ్తున్నామన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఈడిగ ఆంజనేయ గౌడ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం ఏర్పడ్డాక క్రీడాకారులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని కవిత అన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక స్టేడియం నిర్మించుకుంటున్నట్లు చెప్పారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసేలా ప్రభుత్వం పని చేస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలో ఉద్యమకారుడు ఆంజనేయులు గౌడ్‌ను ప్రభుత్వం గుర్తించి నియమించిందన్నారు. ఆయనను కవిత అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ కూడా పాల్గొన్నారు.

పిల్లలతో సాగర్‌లో దూకి ఆత్మహత్యకు మహిళ యత్నం

వెంటనే కాపాడిన ట్రాఫిక్ సిఐ శ్యామ్ సుందర్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిమాయత్ సాగర్ చెరువులో దూకేందుకు యత్నించిన ఓ వివాహిత, ఇద్దరు పిల్లలను ట్రాఫిక్ సిఐ శ్యాంసుందర్ రెడ్డి రక్షించారు. భర్తతో గొడవ పడి తన ఇద్దరు పిల్లలతో కలిసి హిమాయత్ సాగర్ చెరువు వద్దకు చేరుకుంది. పిల్లలతో కలిసి చెరువులో దూకడానికి ప్రయత్నించిన మహిళను చూసిన పోలీసులు చెరువు వద్దకు పరుగులు తీసి ఆమెను అడ్డుకున్నారు. మహిళను, ఇద్దరు పిల్లలను బటయకు లాగేశారు. వారిని కాపాడి పోలీస్ వాహనం లోకి ఎక్కించి రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. వివాహిత 3వ

ప్రగతిభవన్ ముట్టడికి బిజెవైఎం యత్నం

అడ్డుకుని అరెస్ట్ చేసిన పోలీసులు

కలవడానికి వెళితే అరెస్టులా అన్న బండి

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): ప్రగతి భవన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రగతి భవన్ వద్ద ధర్నా చేపట్టారు. ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల విషయంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తప్పుగా ఇచ్చిన 3వ

బిజెపి తీరుతో విసిగిపోయిన దేశయువత

2కోట్ల ఉద్యోగా హామీని విస్మరించిన మోడీ

బిఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పిన మంత్రి

సూర్యాపేట, జనవరి 5 (సమ సమాజం): కేంద్రంలో బీజేపీ పాలనతో విసుగు చెందిన యువత బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ.. 3వ

పంచాయితీ నిధులు స్వాహా చేసిన ఘనులు

అప్పుల్లో కూరుకు పోయిన తెలంగాణ రాష్ట్రం

సిఎం కెసిఆర్ తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జనవరి 5 (సమ సమాజం): పంచాయతీలకు కేటాయించిన కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం గంటలోనే పక్కదారి మళ్లించిందని తెలంగాణ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. పంచాయితీలను బలోపేతం చేసేందుకు ప్రధాని మోడీ నేరుగా నిధులు జమచేస్తే వాటిని తస్కరించిన తీరు దారుణమన్నారు. ఇంతకంటే దౌర్భాగ్యం మరోటి ఉండదన్నారు. సర్పంచ్‌ల ఆందోళనలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుని పోయిందని మండిపడ్డారు. గురువారం నాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మొండి వైఖరి కారణంగా ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. పేదలకు అందాల్సిన సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. రోడ్ల 3వ

నగరాలు, పట్టణాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్

మాస్టర్ ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి

కామారెడ్డి మాస్టర్ ప్లాన్ కేవలం డ్రాఫ్టు మాత్రమే

ప్రజలకు ఎందుకు వివరించలేక పోయారు

పట్టణ ప్రగతి సదస్సులో అధికారులకు మంత్రి కెటిఆర్ ప్రశ్న

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): నిర్మాణాత్మక నగరాలు, పట్టణాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్ తయారు చేశామని పురపాలక, ఐటి శాఖల మంత్రి కెటి రామారావు అన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రజలకు అనుకూలంగా ఉండాలి.. వ్యతిరేకంగా ఉండొద్దు అని కేటీఆర్ పేర్కొన్నారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ నిరసనలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. హైదరాబాద్‌లోని మర్రి 3వ

సంపాదకీయం

ఆహార భద్రతకు భరోసా ఎప్పుడో?

దేశంలో ఆహారధాన్యాల కొరత లేదంటారు. తెలంగాణలో ధాన్యం అమ్ముకుందామంటే కొనడం లేదని అంటారు. ఎపిలోనూ ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని అంటున్నారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. మార్కెట్లో మిర్చి ధరలు మాత్రం సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. ఇలా ఆహారధాన్యాల ఉత్పత్తి, డిమాండ్, ప్రజల అవసరాల మధ్య ఎంతో వ్యత్యాసం ఉంది. ప్రపంచంలో ఎక్కడ ఏ మూల ఏ అవాంతం వచ్చినా దేశంలో సమస్యలు వచ్చిపడుతుతున్నాయి. నిజానికి మన దేశంలో అన్నిరకాల పంటలు పండుతాయి. అన్నిరకాల సూనెగింజలు కూడా పండుతున్నాయి. పప్పు ధాన్యాలకు కొదవే లేదు. అయినా ఇక్కడి పంటలకు గిట్టుబటు ధరలు రావు. అలాగే కావాల్సిన పదార్థాలకు బోలెడు వెచ్చించాల్సి వస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం వచ్చినప్పుడు వంటనూనెల ధరలు అమాంతంగా పెరిగాయి. ఇన్ని పంటలు పండుతున్నా..గిట్టుబాటు ధరలు లేవని అన్నదాతలు అంటున్నా...సామాన్యులకు మాత్రం ధరాఘాతం తప్పడం లేదు. లోపం ఎక్కడ ఉందో ఆలోచనచేయాలి. దేశ జనాభాకు అనుగుణంగా పంటల ను పండించి, విదేవాల నుంచి ఆహారధ్యాలను, సూనెలను దిగుమతి చేసుకునే దౌర్భాగ్యం నుంచి బయట పడకపోతే... సంక్షోభాలు తప్పవు. ప్రస్తుత అస్తవ్యస్థ విధానాలకు పాలకుల అసమర్థతే కారణంగా చెప్పు కోవాలి. ఎండు కంటే పంటలను పండించే అన్నదాతలు ఉన్నా..వారిని ప్రోత్సహించి దేశానికి అసవరమైన ధాన్యాలను నిల్వ చేసుకోలేక పోతున్నాం. జనానికి అందించలేకపోవున్నాం. సరైన వ్యవసాయ విధానం అమలు చేస్తే దేశంలో ఆకలిచావులు ఉండవు. రేషన్ వ్యవస్థ అసవరం రాదు. బహిరంగ మార్కెట్లో ఆహార ఉత్పత్తులను సరసమైన ధరలకు అందేలా చేయగలుగుతాం. ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించేందుకు ప్రజలందరికీ అన్ని వేళలా అవసరమైన ఆహార ధాన్యాలను తగిన మోతాదులో అందుబాటులో ఉండేలా చూడటం, ప్రభుత్వాల విధి. అంతేగాకుండా పౌష్టికాహారం తీసుకునేలా ప్రజలను ప్రోత్సహించడం కూడా జరగాలి. ఇందుకు అసవరమైన మార్కెట్ విధానం ప్రవేశ పెట్టి సహకరించడం ప్రభుత్వాల బాధ్యత కూడా. తద్వారా ఆహార సుస్థిరతను సాధించడం సాధ్యం చేసుకోవచ్చు. ఆహార భద్రతకు ప్రభుత్వ పరంగా విధానం ఉండాలి. ఆహార భద్రత హక్కును మన రాజ్యాంగంలో నేరుగా ప్రస్తావించకపోయినా ప్రణాళికాబద్ధ చర్యలు తీసుకుని ఉంటే ఇదేమీ సాధ్యం కాని పనులు కాదు. దేశంలో ఉన్న జనాభాకు అనుగుణంగా బియ్యం, పప్పులు, తిలధాన్యలను పండించడం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలి. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును ఆహారహక్కుగా మార్చాలి. జీవించడమంటే అర్థాకలితో అనికాదన్న విషయం గుర్తించాలి. ఆహారం తో పాటు మనిషి జీవనానికి అవసరమైన ప్రాథమిక అవసరాలు అనేవి కూడా రాజ్యాంగ కల్పించిన హక్కులే. నేటికీ ఆహారమే దక్కని కుటుంబాలు ఎన్నో. పొట్టకూటి కోసం ఎందరో తంటాలు పడుతున్నారు. అలాంటి వారికి అన్నం పెట్టే దిక్కులేకుండా చేయడం వారి హక్కును హరించడమే తప్ప మరోటి కాదు. అలాంటి వారికి ఇక పౌష్టికాహారం ఎలా పెట్టగలం. 2013లో ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చింది కూడా ఈ నేపథ్యంలోనే. కానీ ప్రపంచ ఆహార సూచీలో దేశం ఏటికేడూ దిగజారిపోతోంది. పలురాష్ట్రాల్లో నేటికీ వెలుగుచూస్తున్న ఆకలి చావులు పాలకుల అసమర్థ విధానాలను గుర్తు చేస్తున్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించారు. ఏడాదిపాటు చట్టాల పేరుతో వారిని రోడ్డు పడేశారు. దేశంలో అందరికీ సరిపడా ఆహారధాన్యల ఉత్పత్తి జరుగుతున్నా ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లక పోవడం, తగు నిర్ణయాలు తీసుకోక పోవడం వంటి కారణాల వల్ల ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. గోదాముల్లో ధాన్యం ముక్కుతున్నా పేదలు మాత్రం ఆకలితో చావడం ఎంతవరకు

సమంజసం. 'జాతీయ ఆహార భద్రతా చట్టం' కింద ఆహార ధాన్యాల సబ్సిడీ కోసం కేంద్ర ప్రభుత్వం 2021-22లో రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు చేసింది. సబ్సిడీ ఆహార ధాన్యాల్ని నిలిపివేయడం ద్వారా మంచి సాధించాల నుకుంటే అందరికీ ఆహారం అన్న హక్కును కల్పించాలి. గర్భిణీలకు, తల్లులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించే ఐసిడిఎస్‌లకు, మధ్యాహ్న భోజన పథకాలకు కూడా కేంద్రం నిధులను తగ్గిస్తోంది. కోవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయి పేదరికం కోరలు చాచిన నేపథ్యంలో పాలకులు ఆహార ధాన్యాల సబ్సిడీని మరింతగా తగ్గిస్తున్నారు. నిజానికి సబ్సిడీ లేకుండానే ఉన్న ధాన్యాలను దేశ ప్రజలకు అందుబా టులోకి తీసుకుని రావాలి. దేశ జనాభాలో మూడింట రెండొంతుల ప్రజానీకానికి ఏడాది పాటు ఉచితంగా ఆహార ధాన్యాలు అందజేస్తామని ప్రకటించి సబ్సిడీ ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగించబోమని ప్రకటిం చింది. అలాకాకుండా తక్కువ ధరలకు అందుబాటులో ఆహారధాన్యాలను అందించాలి. లేకుంటే నిరు పేదలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. ప్రపంచ ఆహార సూచీలో భారత్ అట్టడుగున నిలిచిన నేపథ్యం లోనూ ఆహార ధాన్యాలను కుదించడం ఒక ఎత్తుగడగా కనిపిస్తోంది. ఆహార భద్రత చట్టం కింద ఒంటరి మహిళలు, వికలాంగులు, నిరాశ్రయులు, వితంతు ఫించను పొందేవారు, ఏ ఆసరాలేని నిరుపేదలు, నిరుద్యోగులు, వయోవృద్ధులు వంటి వారికి ఆహారభద్రత దక్కాలి. ఈ నిరుపేదలంతా పౌష్టికాహారం కోసం ప్రయివేటు మార్కెట్‌పై ఆధారపడాల్సివస్తుంది. ఈ సమస్యలను పాలకులు చర్చించాలి. బియ్యం, గోధుమ లు, పప్పులు, సూనెలు, పంచదార తదితర నిత్యావసరాలు సరసమైన ధరలకు బహిరంగ మార్కెట్లో అందించగలగాలి. మార్కెట్‌ను కంట్రోల్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రపంచలో ఎక్కడ ఏ మూల ఏం జరిగినా మన ఆహారభద్రతకు లోటు లేకుండా చేయాలి. ఇందుకు విజ్ఞత ప్రదర్శించాలి. అప్పుడే దేశం ఆహారభద్రతను పొందగలదు.

పృథ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

ఉద్యోగ తెలంగాణగా 2023 సంవత్సరం

81వేల ప్రభుత్వ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్
కోరుట్ల, మెట్‌పల్లిలో వంద పడకల ఆస్పత్రులకు శంకుస్థాపన
ప్రతి నియోజకవర్గానికో డయాలసిస్ సెంటర్
ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం
వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్ రావు వెల్లడి

జగిత్యాల,జనవరి5(సమ సమాజం): రాష్ట్ర ప్రభుత్వం 81వేల ప్రభుత్వ ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్లు జారీ చేస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. 2023 సంవత్సరాన్ని ఉద్యోగ తెలంగాణగా ప్రభుత్వం మార్చిందని అన్నారు. కోరుట్లలో రూ. 20 కోట్లతో అప్‌గ్రేడ్ చేసిన వంద పడకల ఆస్పత్రికి గురువారం మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే మెట్‌పల్లిలోనూ వందపడకల ఆస్పత్రికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ వచ్చిన నాటి నుంచి నేటి వరకూ ఒక్క వైద్య ఆరోగ్య శాఖ లో 6,431 డాక్టర్ పోస్టులు, 7600 స్టాఫ్ నర్స్ లు, 5192 పారా మెడికల్ సిబ్బంది. 900 మంది ఇతర సిబ్బంది మొత్తం 21,200 మందిని కొత్తగా నియమించా మని అన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ హయాంలో 6 శాతం ఉన్న నిరుద్యోగం 8.3 శాతానికి పెరిగిందని వివరించారు. తెలంగాణ లో 4.1 మాత్రమే నిరుద్యోగిత రేటు ఉందని వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు తెలంగాణ లో మూడే డయాలసిస్ సెంటర్లు ఉండగా ఇపుడు 122 చేశామని అన్నారు.ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతి నియోజకవర్గానికో డయాలసిస్ సెంటర్ తీసుకొచ్చామని పేర్కొన్నారు. తెలంగాణ లో 200 ఉన్న ఐసీయూ బెడ్ లను 6వేలకు పెంచామని గుర్తు చేశారు. తెలంగాణ లో 950 మంది డాక్టర్లను కొత్తగా నియమించగా ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 90 మంది డాక్టర్లను నియమించామని తెలిపారు. సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్య శాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చి , నిధులను పెంచి పేదలకు ఆరోగ్యం ను చేరువ చేశారని కొనియాడారు. హెల్త్ సెక్టార్ లో తెలంగాణ బెస్ట్ పెర్ఫార్మెన్స్ స్టేట్ అని కేంద్ర ప్రభుత్వ మే తేల్చిందని పేర్కొన్నారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక వైద్య ఆరోగ్య శాఖ ముఖ చిత్రం మారిందని అన్నారు. హుజీపురలో బస్తీ దవాఖానాను , కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ను మంత్రి హరీశ్ రావు ప్రారంభించగా స్థానిక శాసన సభ్యులు విద్యాసాగర్ రావు, జిల్లా కలెక్టర్ జి రవి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు మెట్‌పల్లిలో నిర్మించనున్న ప్రభుత్వ దవాఖానాకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన.. తెలంగాణ రాకముందు మెట్ పల్లి ప్రభుత్వాసుపత్రిలో ఏటా 200 ప్రసవాలు జరిగితే ప్రస్తుతం ఆ సంఖ్య 2వేలకు పెరిగిందని అన్నారు. ఆరోగ్య సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి హరీష్ రావు అన్నారు. అందులో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రులు నిర్మిస్తున్నట్లు చెప్పారు. 30 పడకల కోరుట్ల ప్రభుత్వాసుపత్రిని 20 కోట్ల వ్యయంతో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు తెలిపారు. మెట్?పల్లికి బస్తి దవాఖానా మంజూరు చేస్తున్నట్లు హరీష్ రావు చెప్పారు. ప్రతిపాదనలు పంపిస్తే ఏఎన్ఎం సబ్ సెంటర్ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. మెట్?పల్లి ఆసుపత్రిలో 73 శాతం సీ సెక్షన్?లు చేస్తున్నారని.. కానీ 73 శాతం సాధారణ ప్రసవాలే జరగాలని తెలిపారు. గర్భిణులు తల్లిదండ్రులు సహజ ప్రసవాలకు మొగ్గు చూపాలని సూచించారు. నార్మల్ డెలివరీలతో మహిళలకు అన్ని విధాలుగా శ్రేయస్కరమని చెప్పారు. తెలంగాణ వచ్చిన నాటి నుండి 1,42,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్?లు ఇచ్చామని హరీష్ రావు తెలిపారు. కొత్తగా 81 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ లు ఇస్తున్నామని..రాష్ట్రంలో రిక్రూట్?మెంట్?ల జాతర జరుగుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్?తో వ్యవసాయ సాగుకు ప్రభుత్వం సమృద్ధిగా జలాలు అందిస్తోందన్నారు. వరద కాలువను రిజర్వాయర్ గా మార్చిన ఘనత సిఎం కేసిఆర్ కే దక్కుతుందన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు 68 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండితే.. ప్రస్తుతం 2 కోట్ల 48 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతున్నాయని హరీష్ రావు తెలిపారు. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. రైతుల గురించి మాట్లాడే హక్కు సీఎం కేసీఆర్ సహా తెలంగాన ప్రభుత్వానికే ఉందన్నారు. త్వరలోనే మహిళలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తామని తెలిపారు.

కెసిఆర్‌కు ఛోటూరామ్ అవార్డు

అఖిల భారత రైతుసంఘం ప్రతినిధుల ప్రకటన● మంత్రి నిరంజన్‌ను కలసి అవార్డు అందచేత

హైదరాబాద్,జనవరి5(సమ సమాజం): భారత రైతాంగ శ్రేయస్సు కోసం మహాయజ్ఞం మొదలుపెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అఖిల భారత రైతుసంఘం ప్రతినిధులు సర్ ఛోటూరామ్ అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు కలిసి అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పంజాబ్ రైతులు ప్రదానం చేసిన సర్ ఛోటూ రామ్ అవార్డును రైతాంగ ప్రతినిధుల నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద రంగం వ్యవసాయం. ఇందులో విశేషమైన మార్పు రావాలన్నది కేసీఆర్ సంకల్పం అని స్పష్టం చేశారు. ఇక్కడి భూమిని, నీళ్లను, మానవ వనరులను సద్వినియోగం చేసుకుని ప్రపంచానికి మనమే అన్నం పెట్టే స్థాయికి భారత్ ఎదగగలదు. కానీ ప్రస్తుత విధానాలు అందుకు తగ్గట్టులేవు అని తెలిపారు. ఆహార రంగంలో గొప్ప ఉపాధి అవకాశాలు ఉన్నాయని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చేసిన ప్రయత్నాలు ఏవీ కనిపించలేదన్నారు. తెలంగాణ మోడల్ దేశానికి పరిచయం చేసి కొత్త దారి చూపాలన్న తపనతో సీఎం ఉన్నారని స్పష్టం చేశారు. దీనికి మేధావులు, రైతు నాయకులు విశేషంగా ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి 700 మంది పైచిలుకు రైతులు చనిపోతే కేంద్ర ప్రభుత్వం లో చలనం లేకపోయిందన్నారు. రైతుల పోరాటానికి తలొగ్గి, నిస్సిగ్గగా జాతికి క్షమాపణలు చెప్పి చట్టాలను వెనక్కి తీసుకున్నా చనిపోయిన రైతు కుటుంబాలకు పరిహారం ఇవ్వాలన్న ఆలోచన తట్టలేదని ధ్వజమెత్తారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాల్ల ఎల్లలు దాటి చనిపోయిన రైతు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున సాయం అందించారని నిరంజన్ రెడ్డి గుర్తు చేశారు. ఇది ఆర్థిక చేయూత మాత్రమే కాదు .. రైతుల కష్టాలలో భాగం పంచుకునే ఒక గొప్ప ముఖ్యమంత్రిని కేసీఆర్‌లో చూస్తున్నాం అని పంజాబ్ రైతు నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మూసీ రివర్ బోర్డ్ మేనేజ్‌మెంట్ చైర్మన్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అవార్డును మంత్రికి అందజేసిన వారిలో ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సంయుక్త్ కిసాన్ మోర్చా సభ్యులు సత్నాం సింగ్ బెహ్రూ, ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ అఖిల భారత సలహాదారులు సుఖ్ జిందర్ సింగ్ కాకా, రాచ్ పాల్ సింగ్ ఖల్సా, మీడియా కార్యదర్శి అవతార్ సింగ్ దుండా ఉన్నారు. పంజాబ్ రైతులు ప్రధానంగా ఇద్దరు వ్యక్తులను ఆరాధిస్తారు. ఒకరు సర్ ఛోటూ రామ్, మరొకరు స్వామినాథన్. 1881లో బ్రిటీష్ ఇండియాలో పంజాబ్ ప్రావిన్స్‌లో సర్ ఛోటూ రామ్ ఝూట్ కుటుంబంలో జన్మించారు. యునైటెడ్ పంజాబ్ ప్రావిన్స్‌ను పాలించిన నేషనల్ యూనియనిస్ట్ పార్టీకి ఆయన సహా వ్యవస్థాపకుడు. నాడు కాంగ్రెస్, ముస్లింలీగ్‌ను తన పార్టీకి దూరంగా ఉంచారు. వడ్డీ వ్యాపారుల చేతుల్లో పడి నలిగిపోతున్న నాటి పంజాబ్ రైతుల శ్రేయస్సు దృష్ట్యా సర్ ఛోటూ రామ్ 1934లో పంజాబ్ రిలీఫ్ అప్పుల చట్టం, 1936లో పంజాబ్ రుణదాతల రక్షణచట్టం తేవడానికి కృషిచేశారు. తదనంతర కాలంలో ఈ చట్టాలు పంజాబ్ రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పులు తెచ్చాయి. ఆ తర్వాత హరితవిప్లవంతో స్వామినాథన్ పంజాబ్ రైతులను గణనీయంగా ప్రభావితం చేశారు. ఆ తర్వాత తమను ప్రభావితం చేసిన వ్యక్తి కేసీఆర్ అని పంజాబ్ రైతులు మంత్రి నిరంజన్ రెడ్డితో అన్నారు. అందుకే ఈ అవార్డు వారికి ఇస్తున్నట్లు పంజాబ్ రైతులు వెల్లడించారు.

గంగుల తండ్రి మల్లయ్యకు మంత్రుల నివాళి

మంత్రిని పరామర్శించిన హరీష్, కొప్పుల

కరీంనగర్,జనవరి5(సమ సమాజం): పితృవియోగంతో బాధలో ఉన్న మంత్రి గంగుల కమలాకర్‌ను మంత్రులు హరీశ్ రావు, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపి వినోద్ కుమార్ తదితరులు ఓదార్చారు. గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య (87) గుండెపోటుతో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లోని గంగుల ఇంటికి చేరుకున్న మంత్రులు హరీశ్ రావు, కొప్పుల, ప్రణాళికా సంఘం అధ్యక్షుడు వినోద్ కుమార్.. మల్లయ్య పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాగా, మంత్రి గంగుల తండ్రి అంత్యక్రియలు మరికొద్ది సేపట్లో జరుగనున్నాయి.

సంక్రాంతి పండుగకు బస్సు ఛార్జీలను పెంచం

రానుబోను బుక్ చేసుకుంటే పదిశాతం రాయితీ

ఆర్టీసీ ఎంపి సజ్జన్నార్ వెల్లడి

హైదరాబాద్,జనవరి5(సమ సమాజం): సంక్రాంతి పండుగకు బస్సు ఛార్జీల్లో ఎలాంటి పెంపు ఉండదని, సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్‌ఆర్టీసీ) ఎండీ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఛార్జీలు పెంచకపోవడమే కాకుండా రాయితీలు ఇస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి రానుపోను ప్రయాణంనకు ఒకేసారి టికెట్ బుక్ చేసుకున్న వారికి తిరుగు ప్రయాణంపై 10 శాతం రాయితీని కల్పిస్తున్నామని, ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. సంక్రాంతికి ప్రత్యేక బస్సుల ఏర్పాట్లపై గురువారం హైదరాబాద్‌లో బస్‌భవన్‌లో ఉన్నతాధికారులతో సజ్జనార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం అడ్వాన్స్‌డ్ టికెట్ బుకింగ్‌ను 30 రోజుల నుంచి 60 రోజులకు పెంచినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాలకు ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలకు ఎండీ సూచించారు. రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులను పెంచాలని ఆదేశించారు. హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో ఒక కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రజల కోసం 4,233 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించినట్లు సజ్జనార్ తెలిపారు. ఇందులో 585 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లోని అమలాపురానికి 125, కాకినాడకు 117, కందుకూరుకు 83 బస్సులు, నర్సాపురం 14, పోలవరం 51, రాజమండ్రి 40, రాజోలు 20, ఉదయగిరి 18, విశాఖపట్నం 65, నెల్లూరు 20 బస్సులు నడుపుతున్నట్లు ఎండీ వెల్లడించారు. నెల 11 నుంచి 14 వరకు ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి ఈ ప్రత్యేక బస్సులు బయలుదేరతాయని తెలిపారు. ఏపీ నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసం ఈ నెల 16 నుంచి 18 వరకు మరో 212 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విజయవాడ 54, విశాఖపట్నం 19, అమలాపురం 23, శ్రీకాకుళం 9, ఏలూరు 11, రాజమండ్రి 12, గుంటూరు 29, బాపట్ల 5, చీరాల 7, మచిలీపట్నం 5, గుడివాడ 6, తెనాలి 4, రాజోలు 9 ప్రత్యేక బస్సులు నడపనున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో టీఎస్‌ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, ఈడీలు వినోద్ కుమార్, మునిశేఖర్, యాదగిరి వెంకటేశ్వర్లు, పురుషోత్తం, సీటీఎం జీవన్‌ప్రసాద్ పలువురు ఆర్ఎంలు, డీఆర్ఎంలు పాల్గొన్నారు.

కార్పొరేట్ కు ధీటుగా పాఠశాలల అభివృద్ధి

మన బస్తీ-మన బడి సమీక్షలో మంత్రి తలసాని

హైదరాబాద్,జనవరి5(సమ సమాజం): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం మాసాబ్ ట్యాంక్‌లోని తన కార్యాలయంలో మన బస్తీ-మన బడి కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించడం కోసం సీఎం కేసీఆర్ ఆదేశాలతో మన బస్తి- మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 9,123 పాఠశాలలు, హైదరాబాద్ జిల్లాలో 239 పాఠశాలల్లో మన బస్తీ -మన బడి కార్యక్రమం క్రింద అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సన్నబియ్యం తో మధ్యాహ్న భోజనం పెడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వెల్లడించారు.సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, సాయన్న, కౌసర్ మొహినోద్దిన్, మౌజం ఖాన్, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనంపై తల్వార్లతో దాడి

దొంగల దాడిలో ఒకరు మృతి

హైదరాబాద్,జనవరి5(సమ సమాజం): జిల్లాలోని నార్సింగి వద్ద అర్ధరాత్రి దారి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరిపై దొంగలు తల్వార్లతో విచక్షణారహితంగా దాడి చేయడంతో ఒకరు మృతి చెందారు. రక్త మైసమ్మ దేవాలయం సమీపంలో దారికాచిన దోపిడీ దొంగలు అటకాయించి ద్విచక్రవాహనంపై ఉన్న కిశోర్ కుమార్ రెడ్డి, తులసి అనే ఇద్దరిపై తల్వార్ల తో దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడ్డ కిశోర్ కుమార్ రెడ్డి ఘటనా స్థలంలో మృతి చెందాడు. దొంగల బారి నుంచి తప్పించుకున్న తులసి దాడిలో చేయి నాలుగు వేళ్లు కోల్పోయింది . తులసి వద్ద ఉన్న రూ. 15 వేలు దొంగిలించిన ముఠా సభ్యుల నుంచి ఆమె తప్పించుకుని నార్సింగి పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమెను ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాజన్న జోన్ కొత్త డీఐజీగా కె.రమేష్ నాయుడు

కరీంనగర్,జనవరి5(సమ సమాజం): ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజన్న జోన్ కొత్త డీఐజీగా కె.రమేష్ నాయుడు బాధ్యతలు స్వీకరించారు. కరీంనగర్ కేంద్రంలోని డీఐజీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు రాజన్న జోన్ ఇంఛార్జి డీఐజీగా కరీంనగర్ సీపీ సత్యనారాయణ విధులు నిర్వహించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రమేష్ నాయుడికి... సీపీ సత్యనారాయణ, డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ చంద్రమోహన్?తో పాటు ఇతర పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు. మరోవైపు రెండు రోజుల క్రితం రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో మొత్తం 29 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

ఉద్యోగ నోటిఫికేషన్ల పేరుతో మోసం

ముందస్తు ఎన్నికల కోసమే ఈ ప్లాన్: అద్దంకి

హైదరాబాద్,జనవరి5(సమ సమాజం): ఉద్యోగ నోటిఫికేషన్ల పేరుతో ఎన్నికలకు పోవాలని కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత అద్దం దయాకర్ ఆరోపించారు. కేవలం ఎన్నికల కోసమే నోటిఫికేషన్లు ఇచ్చినట్లు ఉందని అన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో 4 మీటర్ల లాంగ్ జంప్ పెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాలు ఇవ్వలేని కేసీఆర్ దేశ ప్రజలకు ఏం చేస్తారని విమర్శించారు. పోలీస్ అభ్యర్థుల సమస్య పరిష్కరించకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రశ్నపత్రంలో 10 తప్పులు ఇచ్చిన ప్రభుత్వం అభ్యర్థులకు ఇరవై మార్కులు కలపాలని డిమా

నగరాలు, పట్టణాల అభివృద్ధి కోసమే మాస్టర్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి) చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో పట్టణ ప్రగతి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను ఆ జిల్లా అదనపు కలెక్టర్‌ను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. కేవలం మాస్టర్ ప్లాన్ ముసాయిదా మాత్రమే ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. ఇదే విషయాన్నిప్రజలకు చెప్పాల్సిందని అన్నారు. ప్రజల కోణంలోనే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యంతరాలు ఉంటే ముసాయిదాలో మార్పులు చేస్తామని ప్రకటించారు. వినతులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ప్రజలకు అన్ని విషయాలు వివరించాలని సూచించారు. 500 ఎకరాలు ఇండస్ట్రియల్ జోన్‌కు పోతోందని ఆందోళన చెందుతున్నారు. భూమి పోతుందని ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో చూశానని తెలిపారు. ఈ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టేందుకు లేదని స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ పురపాలక శాఖ ఆదర్శంగా ఉండాలని కేటీఆర్ ఆకాంక్షించారు. పట్టణాల అభివృద్ధి కార్యాచరణపై మున్సిపల్ కమిషనర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. పౌరుడు కేంద్రంగా ఉండాలన్న ప్రభుత్వం ఆకాంక్షకు అనుగుణంగా ఎలాంటి మార్పులు చేసినా.. స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగకుంటే కేంద్రం ఊరికే గుర్తింపు ఇస్తుందా? కేంద్రం ఇస్తున్న అవార్డులే మన పనితీరుకు నిదర్శనం. 141 పురపాలక సంఘాల్లో 42 'ఓడీఎఫ్‌గుర్తింపు సాధించాయి. మిగతా 99 పురపాలక సంఘాలూ ఇదే స్ఫూర్తితో కృషి చేయాలని కేటీఆర్ సూచించారు. అధికారులు, యంత్రాంగం కొత్త ఆవిష్కరణలతో వస్తే స్వీకరిస్తామని తెలిపారు. పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న అధికారులను గుర్తించి, రివార్డులు ప్రకటిస్తామన్నారు.

ప్రగతిభవన్ ముట్టడికి బిజెవైఎం యత్నం

(మొదటి పేజీ తరువాయి) ప్రశ్నలకు మార్కులకు కలపాలని, లాంగ్ జంప్‌ను పాత పద్ధతిలోనే నిర్వహించి అభ్యర్థులకు న్యాయం చేయాలంటూ ప్రగతి భవన్ ముట్టడికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నెల రోజులుగా న్యాయం కోసం నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు జిల్లాల్లోని కలెక్టర్ కార్యాలయం ముందట ధర్నాలు నిర్వహించినా, అధికారులకు వినతి పత్రం అందించినా పట్టించుకోవడం లేదని అన్నారు. కోర్టు తీర్పును అమలు చేయకుండా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రగతిభవన్ వద్ద ముట్టడికి యత్నించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలావుంటే బీజేవైఎం కార్యకర్తలు, పోలీసు పరీక్ష అభ్యర్థుల అరెస్టును ఖండిస్తున్నానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ అన్నారు. అరెస్టు చేసిన యువ మోర్చా కార్యకర్తలు, పోలీసు పరీక్షా అభ్యర్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎంను కలవడానికి వెళితే బీజేవైఎం, పోలీస్ పరీక్ష అభ్యర్థులపై పోలీసులు విచక్షణా రహితంగా ప్రవర్తించారని ఆరోపించారు. పోలీసు రిక్రూట్మెంట్ పరీక్షల్లో ఉన్న అసంబద్ధ నిబంధనలు మార్చాలని మొరపెట్టుకున్నా విరకుండా ప్రభుత్వం మొద్దు నిద్రపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా నిబంధనను మార్చాలని తానే స్వయంగా సీఎం గారికి లేఖ రాసినా స్పందించలేదని విమర్శించారు. 2 లక్షల మంది పోలీస్ అభ్యర్థుల విన్నపాన్ని వినే సమయం సీఎంకు లేదా అని బండి సంజయ్ ప్రశ్నించారు. వీళ్ళ బాధలు వినలేనంత తీరిక లేకుండా సీఎం ఏం ఘనకార్యం చేస్తున్నారని విమర్శించారు. బీజేవైఎం కార్యకర్తల పట్ల విచక్షణా రహితంగా వ్యవహరించిన పోలీసులపై చర్య తీసుకోవాలన్న బండి సంజయ్.. వెంటనే పోలీసు పరీక్షల్లోని నిబంధనలను సవరించి అన్యాయానికి గురైన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. పరీక్ష రాసిన వేలమంది రోడ్డు మీదకు రావలసిన పరిస్థితి ఎందుకొచ్చిందో సీఎం అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి పోలీసు రిక్రూట్మెంట్ పరీక్షలో జరిగిన నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌తో బిఆర్ఎస్ పొత్తు ఉండదు

(మొదటి పేజీ తరువాయి) వెళతామని అన్నారు. ఈ క్రమంలో ఎపిలో పోలవరం, విశాఖ ఉక్కుపై కెసిఆర్ పూర్తి అవగాహనతో ఉన్నారని తెలిపారు. పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాకూర్‌ను తొలగించడం కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారమని చెప్పారు. దానితో తమకు సంబంధం లేదని వెల్లడించారు. అలాగే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటామన్న దానిలో కూడా నిజం లేదన్నారు. చావడానికైనా చంపడానికైనా సిద్ధమని.. తెలంగాణలో కేసీఆర్ సైన్యం ఉందంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు. తాము ఎవరికీ భయపడేది లేదన్నారు. కేసీఆర్ ను జాతీయ స్థాయిలో రాకుండా ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా ఈడిగ ఆంజనేయ గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఉమ్మడి ఏపీలో చదువురాని వారిని కూడా హెల్త్ మినిస్టర్లను చేశారని..కేసీఆర్ అన్ని అంశాల మీద పట్టున్న వారికి పదవులిస్తున్నారని చెప్పారు. అందరికీ పదవులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో క్రీడా పాలసీని తీసుకొస్తామని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో సకలజనుల సంపద పెరిగి ఆనందంగా ఉన్నారని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ ఈడిగ ఆంజనేయ గౌడ్ అన్నారు. సంపద పెరిగింది కాబట్టి గ్రామాలు ఆనంద నిలయలుగా మారాయని చెప్పారు. ప్రతి రంగాన్ని సిరుల రంగంగా మార్చిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందన్నారు. వెయ్యికి పైగా గురుకుల పాఠశాలు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. ఈ 8 ఏళ్లలో కేంద్రం సహకరించకపోయిన కేసీఆర్ అన్ని అడ్డంకులను అధిగమించి దేశానికి ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దారని ఆంజనేయ గౌడ్ కొనియాడారు. క్రీడా రంగానికి కేసీఆర్ పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తున్నారని అన్నారు. అత్యంత వెనుకబడిన ప్రాంతం, బడుగు బలహీన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తిగా తనకు ఈ అవకాశం కల్పించినందుకు కేసీఆర్ కు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ క్రీడా రంగాన్ని దేశానికే తల మానికంగా తీర్చిదిద్దే విధంగా పనిచేస్తానని ఆంజనేయ గౌడ్ అన్నారు.

పంచాయితీ నిధులు స్వాహా చేసిన ఘనులు

(మొదటి పేజీ తరువాయి) మరమ్మతులు చేసేందుకు నిధులు లేకపోవడంతో భూములు అమ్మేందుకు సిద్ధమైతున్నారని మండిపడ్డారు. ఎస్సీ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ విషయంపై నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో కంటే తెలంగాణలోనే పెట్రోల్, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. లీటర్ పెట్రోల్ కు అదనంగా రూ.13 రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తుందన్నారు. పెట్రోల్ ధరలపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేయడం సరికాదన్నారు. డీజిల్ పై 22 శాతం వ్యాట్ ఉంటే తెలంగాణలో 27కు పెంచారని ఆరోపించారు. ఆయిల్ కంపెనీలు నష్టాలు వచ్చినా ధరలు పెంచలేద న్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో పెట్రో ఉత్పత్తులు పెరిగినా సామాన్యులపై భారం వేయ కుండా ప్రధాని మోడీ పటిష్ట చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఇకపోతే తెలంగాణ బీజేపీలో ఎలాంటి మార్పులు ఉండవని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న టీమ్‌తోనే ఎన్నికలకు వెళ్తామన్నారు. ఎన్నికలు వస్తే బీజేపీకి ప్రజలే అభ్యర్థులను ఇస్తారని అన్నారు. తమకు నాయకత్వ సమస్య లేదని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణలో నియంత పాలన సాగుతోందని విమర్శలు గుప్పించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌పై దర్యాప్తు జరుగుతుంటే కల్వకుంట్ల కుటుంబానికి చెందినవారి పేర్లు బయట పడ్డాయని... దీనితో కేంద్రానికి ఏం సంబంధం?, ప్రధానిపై విమర్శలు ఎందుకు? అని ప్రశ్నించారు. ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేయమని తాము ఆహ్వానించలేదని తెలిపారు. కవిత అరెస్ట్‌ను సీబీఐ చూసుకుంటుందని కేంద్రమంత్రి అన్నారు.

ఈ మురికి కాలువకు మోక్షమెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి) గ్రామంలో గత ఐదు సంవత్సరాల క్రితం ప్రధాన మురికి కాలువ నిర్మిస్తానని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. అయితే ఇంత వరకు కాలువ నిర్మించలేదు. దీంతో నిరసనకు దిగిన స్థానికులు ఈ మురికి కాలువకి మోక్షం ఎప్పుడు అంటూ ప్లెక్సీలు కట్టి నిరసన తెలిపారు. '2017 లో వెంకటాపూర్ గ్రామలో మురికి కాలువ నిర్మాణానికి కేటీఆర్ హామీ ఇచ్చి మరిచిన కేటీఆర్ . దీన్ని పట్టించుకోని అధికారులు. ఈ మురికి కాలువకి మోక్షం ఎప్పుడు కేటీఆర్' అంటూ ప్లెక్సీ వేయించారు. అయితే ఈ ప్లెక్సీలను బీఆర్ఎస్ నాయకులు, పోలీసులు తొలగించారు.ప్లెక్సీలు తొలగించినా..తమను అరెస్ట్ చేసినా తమ నిరసన ఆగబోదని స్థానికులు తెలిపారు. కేటీఆర్ ఇచ్చిన హామీ నెరవేర్చే వరకు రేపటి నుంచి నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

అభివృద్ధిపై చర్చకు అరవింద్ సిద్ధమా

కెసిఆర్, కెటిఆర్, కవితలను తిట్టిన వారే జీరోలు

అరవింద్ ది ఫీటర్స్ ఫ్యామిలీ :ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

ఆర్మూర్, జనవరి 5 (సమ సమాజం): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆర్మూర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి మున్నెన్నడూ జరగలేదని పీఏసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జరిగిన అభివృద్ధిపై ఎంపీ అరవింద్ చర్చకు సిద్ధమా అంటూ బహిరంగ సవాల్ విసిరారు. గురువారం ఆర్మూర్ పట్టణంలో నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొని, అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్మూర్‌లో రూ.2 వందల కోట్లతో కొత్త అభివృద్ధి పనులు చేపడుతున్నామని, పట్టణంలో రూ. 50 కోట్లతో రోడ్లు వేశామన్నారు. మరో రూ. 23.70 కోట్లతో త్వరలోనే మిగిలిన రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. ' ఆర్మూర్ గతంలో ఎట్లుంది? ఇప్పుడెట్లుంది? స్వాతంత్రం వచ్చాక ఎప్పుడైనా ఇంత అభివృద్ధి జరిగిందా' ? అని ప్రశ్నించారు. ఆర్టీసీ బైపాస్ రోడ్డు, సిద్ధులగుట్టకు ఘాట్ రోడ్డు, టూరిజం స్పాట్ గా గుండ్లచెరువు, నిజామాబాద్–ఆర్మూర్, నందిపేట్–ఆర్మూర్ రోడ్లు, అర్బన్ పార్క్ వంటి అభివృద్ధి పనుల గురించి కన్నారా?, విన్నారా? అని పేర్కొన్నారు. అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడు నోట్లో శని ఉన్నట్లు బీజేపీ నాయకులు దాపురించారని ఆరోపించారు. ఎంపీ అరవింద్ కేసీఆర్ కుటుంబాన్ని తిడితే పెద్దోడినయి పోతాననే భ్రమలో ఉన్నాడని అన్నారు. కేసీఆర్, కేటీఆర్, కవితలను విమర్శించే వారు హీరోలు కాదు జీరోలని అన్నారు. తమది ఫైటర్స్ ఫ్యామిలీ. అరవింద్ ది ఫీటర్స్ ఫ్యామిలీ అని ఎద్దేవా చేశారు. 'పసుపు బోర్డ్ సాధించనందుకు ముక్కు నేలకు రాయి. రాజీనామా చేసి రైతుల కాళ్ళు పట్టుకోవాలని అరవింద్‌కు సూచించారు. వచ్చే ఎన్నికల్లో అరవింద్‌కు డిపాజిట్ కూడా రాదని, ఆయన ఎక్కడ పోటీచేసినా ఓడగొట్టి తీరుతామని స్పష్టం చేశారు. ఆయన వెంట ఆర్మూర్ మునిసిపల్ చైర్ పర్సన్ పండిత్ వినిత పవన్, వైస్ చైర్మన్ మున్ను , వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల ఎరకేసు

(మొదటి పేజీ తరువాయి) కింద కేసులు నమోదు చేయాలన్న అంశంపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రోజు లేదా రేపు ఈ కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంది. మరోవైపు ఫాంహౌస్ కేసుకు సంబంధించి విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. సింగిల్ బెంచ్ తీర్పుపై ప్రభుత్వ రిట్ అప్పీలుపై దాఖలు చేయడంతో సీజే నేతృత్వంలోని ధర్మాసనం దానిపై విచారణ జరిపింది. ఉదయం ప్రభుత్వం తరపున దుష్యంత్ దవే వాదనలు వినిపించారు. లంచ్ బ్రేక్ అనంతరం రోహిత్ రెడ్డి తరపున గండ్ర మోహన్ వాదనలు కొనసాగించారు. తన క్లయింట్ కు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే కింది కోర్టు తీర్పు ఇచ్చిందని రోహిత్ రెడ్డి తరపు లాయర్ ధర్మాసనానికి తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సిట్ దర్యాప్తు కొనసాగుతుండగా.. దాన్ని రద్దు చేసి సీబీఐకు అప్పగించడం సరికాదని అన్నారు. ప్రతిపాదిత నిందితుల తరపున వాదనలు వినిపించిన సీతారామ్మూర్తి రిట్ అప్పీల్ పిటిషన్ అసలు మెయింటేనబుల్ కాదని కోర్టుకు తెలిపారు. క్రిమినల్ రివిజన్ పిటిషన్?పై రిట్ అప్పీల్?కు అవకాశంలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. రివిజన్ పిటిషన్ పై సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

రామగుండం క్యాలెండర్ ఆవిష్కరించిన కెటిఆర్

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): రామగుండం నియోజకవర్గం 2023 నూతన క్యాలెండర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు గురువారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రామగుండం శాసన సభ్యులు కోరుకంటి చందర్, వరంగల్ ఎంపీ రంజిత్ రెడ్డి, ప్రభుత్వ విప్ వినయ్ భాస్కర్, వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిశారు. రామగుండం నియోజకవర్గం గోదావరి ఖని బస్టాండ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. గోదావరిఖనిలో 600 మంది ఆర్టీసీ కార్మికులు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారని వారి కుటుంబాల్లో శుభ కార్యాల కోసం ప్రైవేటు ఫంక్షన్ హాల్, ఆర్టీసీ ద్వారా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని విన్నవించారు.

తెలంగాణ ఓటర్ల తుదిజాబితా విడుదల

33 జిల్లాల్లో మొత్తం 2,99,92,941 ఓటర్లు

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈసీ లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 33 జిల్లాల్లో మొత్తం 2,99,92,941 ఓటర్లున్నారు. ఇందులో 1,50,48,250 పురుష ఓటర్లు ఉండగా, 1,49, 24,718 మహిళా ఓటర్లు ఉన్నారు. రాష్ట్రంలో 15, 282 సర్వీసు ఓటర్లు ఉన్నట్టుగా వెల్లడించింది. 18 నుంచి 19 ఏళ్ల వయస్సు మధ్య 2,78,650 మంది ఓటర్లన్నారు. అత్యధికంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 6,44,072 మంది ఓటర్లు ఉన్నట్టుగా ఈసీ తెలిపింది. అత్యల్పంగా భద్రాచలంలో 1,42,813 మంది ఓటర్ల ఉన్నారని వెల్లడించింది. ప్రతి ఏడాది ఓటర్ల జాబితా సవరణ తరువాత ఓటర్ల తుదిజాబితాను జనవరి నెలలో ఈసీ ప్రకటిస్తుంది. ఇక ఈసీ లెక్కల ప్రకారం ఏపీలో 3,99,84,868 మంది ఓటర్లున్నారు. ఇందులో 2,02,19,104 మంది మహిళా ఓటర్లు, 2,01,32,271 పురుష ఓటర్లున్నారు. రాష్ట్రంలో సర్వీసు ఓటర్లు 68,182 మంది ఉన్నట్లుగా ఈసీ తెలిపింది.

ముస్లింలకు కెసిఆర్ చేసిందేమీ లేదు: షబ్బీర్ అలీ

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): సీఎం కేసీఆర్ ముస్లింలకు చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ విమర్శించారు. కేసీఆర్ పాలనలో 12 శాతం రిజర్వేషన్లు అమలు జరగడం లేదన్నారు. దళితుల కన్నా ముస్లింలు వెనకబడి ఉన్నారని కమిటీలే చెప్పాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన రిజర్వేషన్లతోనే ముస్లింల అభివృద్ధి చెందారని, మెడికల్ కౌన్సిల్?లో ముస్లింలకు రిజర్వేషన్లు కాంగ్రెస్ వల్లే వచ్చాయని తెలిపారు. ఉమ్మడి ఏపీలో 2004లోనే కాంగ్రెస్ హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు అమలు చేసిందన్నారు. మైనారిటీలకు 4 కాలేజీల్లో 560 సీట్లు ఉన్నాయని షబ్బీర్ అలీ తెలిపారు.

బిజెపి తీరుతో విసిగిపోయిన దేశయువత

(మొదటి పేజీ తరువాయి) ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఉన్న ఉద్యోగాలను తీసేస్తుండటంతో యువత కేంద్రం తీరుపై విసుగు చెందుతున్నారన్నారని వెల్లడించారు. సూర్యాపేట పట్టణంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువకులు పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి జగదీశ్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మతంపేరుతో రాజకీయం చేస్తూ దేశంలో చిచ్చుపెడుతున్నదని ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్‌ల వల్ల భారతదేశం తిరోగమనంలో పయణిస్తుందన్నారు. దేశానికి ప్రధాన ఆధారమైన వ్యవసాయ రంగాన్ని గాలికొదిలేశారని చెప్పారు. ఇప్పటికే ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసిన మోదీ ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వేతో పలు పబ్లిక్ సెక్టార్ కంపెనీలను అమ్మేందుకు సిద్ధంగా ఉందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో పేదలు మరింత పేదరికంలోకి వెళుతుండగా, సంపన్నులు భారీగా సంపదను పోగేసుకుంటున్నారని విమర్శించారు. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, అనేక సామాజిక జాఢ్యాలతో దేశం నేడు సంక్షుభితంగా మారిపోయిందని చెప్పారు. దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలలో ఏ పార్టీ కూడా మౌలిక పరమైన సమస్యలను పరిష్కరించడం లేదని, కనీసం ఆ దిశగా చొరవ చూపడం లేదన్నారు. ప్రత్యామ్నాయం లేకపోవడంతో ప్రజలు ఆ రెండు పార్టీలకే అధికారం కట్టబెడుతూ వస్తున్నారని.. ఇలాంటి పరిస్థితుల్లో దేశానికి నూతన పార్టీ బీఆర్ఎస్, కేసీఆర్ రూపంలో సమర్థ నాయకత్వం లభించాయన్నారు. ప్రజల కలలను సాకారం చేసే నాయకుడు కేసీఆర్ మాత్రమేనని వెల్లడించారు. దేశంలో రైతుల పక్షాన నిలబడుతున్న ప్రభుత్వం ఏదైనా ఉన్నదంటే అది తెలంగాణలోనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పాలనతో యువత, మేధావులు, సామాన్య ప్రజానీకం విసుగెత్తిపోయారని, ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. అన్నిరాష్ట్రాల వారు కేసీఆర్ పార్టీ గురించి చర్చించుకుంటున్నారని, రాబోయే కాలంలో దేశం గొప్ప మలుపు తిరగబోతున్నదని మంత్రి తెలిపారు.

పిల్లలతో సాగర్‌లో దూకి ఆత్మహత్యకు మహిళ యత్నం

(మొదటి పేజీ తరువాయి)బండ్లగూడ జాగీర కార్పొరేషన్ హైదర్ షా కోట్ ప్రాంతానికి చెందిన కుర్మమ్మగా పోలీసులు గుర్తించారు. భర్తతో గొడవ పడిన మహిళ తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకునే హిమాయత్ సాగర్ చెరువు వద్దకు వెళ్లిందని చెప్పారు. అనంతరం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ లో మహిళకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మహిళ, ఇద్దరు పిల్లలను కాపాడిన ట్రాఫిక్ అఏ శ్యామ్ సుందర్ రెడ్డి, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

కాలనీలో డ్రైనేజీ సమస్యపై నిరసన

(మొదటి పేజీ తరువాయి) అయిన న్యూ మధురానగర్ కాలనీ పక్కనే ఇంద్రహిల్స్ పేరుతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు మరో బోర్డు ఏర్పాటు చేశారని కాలనీవాసులు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధిని పక్కనపెట్టి పేర్ల కోసం పోటీ పడుతున్నారని వారు ఆరోపించారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో బిఆర్ఎస్ కార్పొరేటర్ విఫలమయ్యారని ప్లకార్డులు పట్టుకుని కాలనీవాసులు బిక్షాటన చేశారు. ఇప్పటికైనా తమ సమస్యలు పట్టించుని మంత్రి సబితా ఇంద్రారెడ్డి జోక్యం చేసుకోవాలని కోరారు.

పోలీస్ ఉద్యోగ నిబంధనలు సవరించాలి

టిజెఎస్ అధ్యక్షుడు కోదండరామ్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 5 (సమ సమాజం): పోలీస్ ఉద్యోగాల నిబంధనలతో అభ్యర్థుల ప్రాణాలు తీస్తున్నారని టీజేఎస్ అధినేత కోదండరాం మండిపడ్డారు. ఆర్మీలో లేని నిబంధనలను ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు పెడ్తున్నారని కోదండరాం అన్నారు. కష్టపడి చదివి ప్రిలిమ్స్ పాస్ అయిన అభ్యర్థులు కఠిన నిబంధనల కారణంగా ఉద్యోగానికి దూరమవుతున్నారన్నారు. ఫిజికల్ టెస్ట్‌లో ప్రమాణాలు చాలా కఠినంగా ఉన్నాయని.. వెంటనే వాటిని సరళించాలన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని.. గతంలో ఉన్న నిబంధనలనే పెట్టాలని కోదండరాం చెప్పారు. ప్రభుత్వం స్పందించేవరకు అభ్యర్థులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ అభ్యర్థుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకు తెచ్చుకోవద్దని హితవు పలికారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పెరుగుతోందని విమలక్క అన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల పోరాటంలో న్యాయం ఉందన్నారు. అభ్యర్థులు ధైర్యాన్ని కోల్పోవద్దని సూచించారు. సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని సూచించారు.

అద్భుతమైన ఆటతో ఆకట్టుకున్న కేదార్ జాదవ్

218 బంతుల్లో 205 పరుగులతో డబుల్ సెంచరీ

ముంబై, జనవరి 5 (సమ సమాజం): అంతర్జాతీయ క్రికెట్ కు చాలాకాలంగా దూరంగా ఉన్న భారత బ్యాట్స్‌మెన్ కేదార్ జాదవ్ అద్భుతమైన ఆటతో మరోసారి వార్తల్లో నిలిచాడు. దేశవాళీ క్రికెట్‌లో మహారాష్ట్ర తరఫున ఆడుతున్న కేదార్ జాదవ్ రంజీల్లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తూ సంచలనం సృష్టించాడు. మహారాష్ట్ర, అస్సాం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో జాదవ్ 218 బంతుల్లో 205 పరుగులు చేసి డబుల్ సెంచరీ సాధించాడు. అతని ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, 8 సిక్సర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన అస్సాం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 274 పరుగులు మాత్రమే చేసింది. ఆ తరువాత బ్యాటింగ్ చేసిన మహారాష్ట్ర కు డబుల్ సెంచరీ సాధించి కేదార్ జాదవ్ ఆ జట్టుకు భారీ అధిక్యాన్ని అందించాడు. మూడో రోజు ఆటలో మహారాష్ట్ర 5 వికెట్ల నష్టానికి 452 పరుగులు సాధించింది. ఈ డబుల్ సెంచరీతో కేదార్ జాదవ్ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్ లోకి వచ్చింది. అయితే గతకొంతకాలంగా ఫామ్ లోని కేదార్ జాదవ్ ఐపీఎల్ 2023 మినీ-వేలంలో అమ్ముడుపోలేదు. ఐపీఎల్ మినీ-వేలం కంటేముందు కేదార్ ఇలాంటి ఇన్నింగ్స్ ఆడి ఉంటే బాగుండని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు. కాగా ఐపీఎల్ లో కేదార్ సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై జట్ల తరుపున ఆడాడు.

ఒకే గ్రూపులో భారత్,పాక్‌లు

ఆసియాకప్ వివరాలు వెల్లడించిన జైషా

ముంబై,జనవరి 5 (సమ సమాజం): ఇండియా, పాక్ మ్యాచ్ కోసం ఎదురుచూసే క్రికెట్ అభిమానులకు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి. గత టీ 20 వరల్డ్‌కప్‌లో ఒకే గ్రూప్‌లో పోటీ పడిన దాయాదులు ఇప్పుడు ఆసియా కప్ 2023లో మరోసారి తలపడనున్నారు. ఈ మేరకు పురుషుల ఆసియా కప్ 2023, మహిళల ఆసియా కప్ 2024 గ్రూప్‌ల వివరాలను బీసీసీఐ కార్యదర్శి జైషా ప్రకటించారు. రెండేళ్లపాటు ఆసియా క్రికెట్ క్యాలెండర్, అండర్ -16, అండర్ - 19, ఎమర్జింగ్ టీమ్స్ (ఏ జట్లు), సీనియర్ పురుషులు, మహిళా జట్లకు సంబంధించిన షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. అయితే గతేడాది టీ20 ఫార్మాట్‌లో ఆసియా కప్ ను ఈ సారి వన్డే ఫార్మాట్ లో నిర్వహించాలని ఏసీసీ నిర్ణయించింది. ఈ టోర్నమెంట్ మే నేలలో ఉండనుంది. 50 ఓవర్ల ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు ఉంటాయి. రెండు గ్రూపులుగా విభజించబడ్డాయి. భారత్, పాకిస్తాన్ తో పాటు క్వాలిఫయర్ ఓ గ్రూప్ లో ఉండగా శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ లు మరో గ్రూప్ లో ఉన్నాయి. ఈ టోర్నీలో 15 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ ఆసియా కప్ కు ఏ దేశం ఆతిథ్యం ఇస్తుందో తెలియలేదు. ఈ ఏడాది ఆసియాకప్ ఆతిథ్య హక్కులు పాకిస్థాన్ వద్ద ఉండగా.. అక్కడికి వెళ్లేందుకు టీమిండియా ఆసక్తి చూపడం లేదు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

జాక్‌పాట్ కొట్టేసిన యువ కీపర్ జితేశ్ శర్మ

సంజూశాంసన్‌కు గాయంతో జట్టులోకి రాక

ముంబై, జనవరి 5 (సమ సమాజం): యువ వికెట్ కీపర్-బ్యాటర్ జితేశ్ శర్మ జాక్‌పాట్ కొట్టేశాడు. శ్రీలంకతో జరగనున్న రెండో టీ20కు అతను ఎంపికయ్యాడు. జితేశ్ భారత జట్టుకు సెలక్ట్ కావడం ఇదే మొదటిసారి. మోకాలి గాయంతో బాధపడుతున్న సంజూ శాంసన్ ప్లేస్‌లో జితేశ్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన తొలి టీ20లో బౌండరీ వద్ద ఫీల్డింగ్ చేస్తుండగా శాంసన్ గాయపడ్డాడు. అతను ఈ సిరీస్ మొత్తానికి దూరం కానున్నాడు. దాంతో, మిగిలిన రెండు టీ20లకు అతని ప్లేస్‌లో జితేశ్‌కు చోటు దక్కింది. వికెట్ కీపర్ రిషభ్ పంత్ కారు యాక్సిడెంట్‌లో గాయపడడం, కేఎల్ రాహుల్ అందుబాటులో లేకపోవడంతో జితేశ్‌కు అవకాశం లభించింది. మహారాష్ట్రలోని అమరావతిలో పుట్టిన జితేశ్ వికెట్ కీపర్‌తో పాటు టాప్‌ర్డర్ బ్యాటర్ కూడా. ఐదు, ఆరో స్థానంలో బ్యాటింగ్ చేయగలడు. దేశవాళీ క్రికెట్‌లో విదర్భకు ఆడాడు. 2012-13 సీజన్‌లో జరిగిన కూచ్ బెహర్ ట్రోఫీలో 537 రన్స్ చేశాడు. దాంతో, విదర్భ సీనియర్ జట్టుకు ఎంపికయ్యాడు. 2014లో విజయ్ హజారే ట్రోఫీలో తొలి టీ20 మ్యాచ్ ఆడాడు. 2015-16లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో టాప్ స్కోరర్ (343)గా నిలిచాడు. 2016 ఐపీఎల్ వేలంలో జితేశ్‌ను ముంబై ఇండియన్స్ కొనుగోలు చేసింది. కానీ, ఒక్క మ్యాచ్ కూడా ఆడించలేదు. 2019లో చెన్నై సూపర్ కింగ్స్ అతడిని రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. జితేశ్ ఐపీఎల్‌లో అరంగ్రేటం చేశాడు. ఐపీఎల్ 2022 మినీ వేలంలో పంజాబ్ కింగ్స్‌కు జితేశ్‌ను దక్కించుకుంది. పోయిన ఏడాది 10 ఇన్నింగ్స్‌ల్లో 234 రన్స్ చేశాడు. ఈ లీగ్‌లో అతడి అత్యధిక స్కోర్ 44. ఢిల్లీ క్యాపిటల్స్ మీద 34 బంతుల్లో 44 పరుగులు చేశాడు. ఈ యంగ్‌స్టర్ ఇప్పటివరకు 76 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. 147.93 స్ట్రయిక్ రేటుతో పరుగులు సాధించాడు.

టాస్ గెలచి ఫీల్డింగ్ చేపట్టిన భారత్

ముంబై, జనవరి 5 (సమ సమాజం): పుణె వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతోన్న రెండో టీ20 మ్యాచ్ లో టీమిండియా టాస్ గెలిచింది. కెప్టెన్ హార్దిక్ పాండ్య ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో శ్రీలంక ముందుగా బ్యాటింగ్ చేపట్టింది. ఈ మ్యాచ్‌తో భారత క్రికెటర్ రాహుల్ త్రిపాఠి అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. మూడు మ్యాచ్ ల టీ20 సిరీస్ లో ఇప్పటికే ఫస్ట్ టీ20 మ్యాచ్ గెలిచిన టీమిండియా

రెండో టీ20లో కూడా గెలిచి సిరీస్ ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. అటు స్వల్ప స్కోర్ తేడాతో ఫస్ట్ టీ20 మ్యాచ్ లో ఓడిన లంక జట్టు ఈ మ్యాచ్ లో గెలవాలని తహతహలాడుతోంది.

చలన చిత్రం

చీరకట్టులో యాంకర్ అనసూయ అహో

నటి, యాంకర్ అనసూయ స్టైలే వేరు. ఆమె ఎప్పుడూ డిఫరెంట్‌గా ఉండడానికి యత్నిస్తారు. ఈ మధ్య యాంకరింగ్ వదిలేసి కేవలం సినిమాల్లోనే బిజీగా ఉంటున్నారు. అందుకనే బుల్లితెరపై కనిపించడంలేదు. అలాగే ఆమె నటించినచిత్రాలు ఇంకా విడుదల కాలేదు. పుష్ప-2 లోనూ ఆమె కీ రోల్ పోషిస్తోంది. ఇక డ్రెస్సింగ్ విషయంలో అనసూయ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. చీరకట్టులో ఆమె మెరిసిపోతున్న ఫోటోలు ఇప్పుడు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.

ఆస్కార్ అవార్డుల బరిలో ఎన్టీఆర్

వెరైటీ మీడియా డ్రీమ్ లిస్ట్‌లో జూనియర్‌కు చోటు

అంతర్జాతీయ ప్రముఖ మీడియా సంస్థలు ఆస్కార్ నామినేషన్స్‌లో ఎవరు ఉంటారు.. ఏ సినిమాలు ఉంటాయి.. ఎవరికి అవార్డులు సాధ్యం అనే ఊహాగానాలతో కథనాలు రాస్తూ ఉంటాయి. ఆ మీడియా సంస్థలు ఊహించి చెప్పిన సినిమాలకే ఆస్కార్ అవార్డులు కూడా దక్కిన సంఘటనలు గతంలో పలుసార్లు జరిగింది. ఇక ఈసారి వెరైటీ అనే ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థ ఉత్తమ నటులుగా ఎవరు ఆస్కార్ నామినేషన్స్‌లో నిలుస్తారో అంటూ పదిమందితో కూడిన ఒక జాబితాను రెడీ చేసింది. అందులో మన యంగ్ టైగర్ ఎన్టీఆర్ పేరు కూడా చోటుచేసుకోవడం విశేషం. 2023 ఆస్కార్ అవార్డుకు పోటీ పడబోతున్న స్టార్స్ అంటూ మెహదీ బజెస్తానీ.. ఆస్టిన్ బట్లర్.. ఏడిన్ డాంబైన్.. కోలిన్ ఫారెల్.. బ్రెండన్ ఫ్రెజర్... హ్యూ జాక్మన్.. బిల్ నైఘీ.. కుపర్ రైఫ్ ఇంకా విల్ స్మిత్‌ల పేర్లను వెరైటీ మీడియా సంస్థ పేర్కొంది. ఈ జాబితాలో మొదటిసారి ఇండియన్ స్టార్ చోటు దక్కించుకున్నాడు. ఆ ఇండియన్ స్టార్ ఎన్టీఆర్ కావడం మనకు గర్వకారణం. టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో గత ఏడాది వచ్చిన ఆర్ఆర్ఆర్ సినిమాలో కొమురం భీమ్ పాత్రలో ఎన్టీఆర్ అద్భుతంగా నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా సూపర్ హిట్ కావడంతో పాటు ఎన్టీఆర్ కొమురం భీమ్‌గా చేసిన నటన అద్భుతం అంటూ అంతర్జాతీయ సమాజం ప్రశంసించింది. ఇప్పుడు ఆస్కార్ కు ఆస్కారం ఉంది అంటూ టాప్ 10 జాబితాలో వెరైటీ మీడియా సంస్థ ఎన్టీఆర్ పేరును చేర్చింది. వెరైటీ మీడియా సంస్థ ఊహించినట్లుగా ఎన్టీఆర్ కనుక ఆస్కార్ కు నామినేట్ అయితే తెలుగు సినిమాస్థాయి మరోసారి అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడటం ఖాయం.

ప్రపంచం మెచ్చే సినిమాలు తీస్తా

న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్‌అవార్డు అందుకున్న జక్కన్న

టాలీవుడ్ జక్కన్న రాజమౌళి గత ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చిన ఆర్ఆర్ఆర్ సినిమా వైబ్రేషన్స్ కంటిన్యూ అవుతూనే ఉన్నాయి. ఈ సినిమా న్యూయార్క్ ఫిల్మ్ క్రిటిక్స్ సర్కిల్ అవార్డుకు ఎంపిక అయిన విషయం తెల్సిందే. తాజాగా దర్శకుడు రాజమౌళి ఆ అవార్డును అందుకున్నారు. ఆ ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకునేందుకు రాజమౌళి చాలా స్పెషల్ గా స్టేజ్ ఎక్కారు. కుర్తాతో భారతీయ సాంప్రదాయం ఉట్టిపడే విధంగా రాజమౌళి డ్రెస్సింగ్ స్టైల్ ఉండటంతో అందరిని ఆకట్టుకుంది. అవార్డును అందుకున్న సందర్భంగా రాజమౌళి మాట్లాడిన మాటలు కూడా అందరిని ఆకట్టుకున్నాయి. సరదాగా తన రెండు కాళ్లు వణుకుతున్నాయి అంటూ స్పీచ్ ను మొదలు పెట్టాడు. తన కాళ్లను కవర్ చేసే విధంగా ఈ డ్రెస్ ను ఇచ్చినందుకు నా ఫ్యాషన్ డిజైనర్ కి కృతజ్ఞతలు. ఇక మా సినిమాను అమెరికాలో ఇంత భారీగా విడుదల కావడంలో సహకరించిన మా డిస్ట్రిబ్యూషన్ సంస్థ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు. ఇండియాలో అద్భుతమైన సినిమాలు.. నమ్మశక్యం కాని సినిమాలు రూపొందుతున్నాయని జక్కన్న పేర్కొన్నాడు. ఆర్ఆర్ఆర్ సినిమాకు అమెరికాలో దక్కిన రెస్పాన్స్ ను మర్చిపోలేను. పశ్చిమంలో నేను ఆర్ఆర్ఆర్ హిస్టీరియా ను చూసి ఆశ్చర్యపోయాను. ఇక తన సినిమాలు, సినిమాల్లోని హీరోల పాత్రల గురించి స్పందిస్తూ.. నా హీరోలు సూపర్ హ్యూమన్స్ గా ఉండాలి అనుకుంటాను. అయితే బలమైన భావోద్వేగంతో వారు తమలోని సూపర్ పవర్ ను చూపించాలని నేను భావిస్తాను. ఇకముందు సినిమాలతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకులను అలరించే దిశగా తీయబోతున్నట్లుగా పేర్కొన్నాడు. అంతే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా సినిమా తీస్తాను అంటూ స్టేజ్ పై జక్కన్న ప్రామిస్ చేశాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in